క్లుప్తంగా

సబ్సిడీపై విత్తనాలు సిద్ధం

అశ్వారావుపేటరూరల్: వానాకాలం సీజన్‌కు సంబంధించి సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉంచినట్లు అశ్వారావుపేట వ్యవసాయ అధికారి నవీన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పంటల సాగుకు ముందు రైతులు తమ పొలాల్లో భూసారాన్ని పెంచుకునేందుకు పచ్చిరొట్ట విత్తనాలను చల్లుకోవాలని సూచించారు. వీటికి అవసరమైన జీలుగు, జనుము విత్తనాలను అశ్వారావుపేట, నారాయణపురంలోగల సహకార సంఘాల్లో అందుబాటు ఉన్నాయని అన్నారు. సబ్సిడీపై జీలుగు(30కిలోలు) రూ.1,116, జనుము (40కిలోలు) రూ.1,448లకు విక్రయిస్తారని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సబ్సిడీపై వీటిని కొనుగోలు చేసేందుకు రైతులు పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్‌లును క్లస్టర్ ఏఈవోలకు అందించి విత్తనాలు పొందవచ్చని చెప్పారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

అశ్వారావుపేటరూరల్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం నుంచి జరిగే పరీక్షలకు రెండు పరీక్షా కేంద్రాలను కేటాయించారు. వివరాలిలా ఉన్నాయి. అశ్వారావుపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 206 మంది విద్యార్థులు, వీకేడీవీఎస్ రాజు జూనియర్ కళాశాలలో 140 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. నేటి నుంచి జరిగే సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 31వ తేదీ వరకు జరుగుతాయని పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరిటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులు నరసింహారావు, ఎ.వెంకటేశ్వరరావు, ముంతాజ్ అహ్మద్ తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

అశ్వాపురం: మణుగూరు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సూరిరెడ్డి కుమారుడు రుత్విక్ నారాయణరెడ్డి జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని ఆరిఫా–రోష్ని వృద్ధాశ్రమంలో గురువారం న్యాయమూర్తి కుటుంబసభ్యులు వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి రుత్విక్ నారాయణరెడ్డి జన్మదిన వేడుకలు చేపట్టారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిర్రా రవి, సర్వేశ్వరరావు, రుద్ర వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో చండీహోమం



చండీహోమం జరిపిస్తున్న అర్చకుడు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో చండీ హోమం జరిపించారు. గురువారం ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, రుద్రాభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ హోమశాలలో అర్చకులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా చండీహోమం జరిపించారు. భక్తులు ఆలయంలో పూజలు చేసి, స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

అన్నమాచార్యుల జయంతి..

తాళ్లపాక అన్నమాచార్యుల 616 జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ సన్నిధానంలోని అన్నమాచార్యుల విగ్రహానికి అభిషేకం చేసి, పూలమాలలు వేశారు. అనంతరం కీర్తనలను ఆలపించి, భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

జాతరలో మాజీ ఎమ్మెల్యే

దమ్మపేట: మండల పరిధిలోని గుర్వాయిగూడెం గ్రామ శివారులో వెంచేసియున్న సమ్మక్క సారలమ్మ జాతర మహోత్సవంలో బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గురువారం పాల్గొని, అమ్మవార్లను దర్శించుకున్నారు. సమ్మక్క సారలమ్మ జాతరకు విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే మెచ్చాకు ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. కుంకుమ, కలశ పూజ కార్యక్రమాల్లో పాల్గొని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దారా యుగంధర్, తాటి పోతురాజు, ఉయ్యాల చిన్నవెంకటేశ్వరరావు, అబ్దుల్ జిన్నా, పాకనాటి శ్రీను, యార్లగడ్డ శ్రీను, యేసుబాబు, మల్లేష్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బిషప్ జన్మదిన వేడుక

భద్రాచలం: క్రిస్టియన్ రైట్, అభిషక్త చర్చి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో బిషప్ ఆనంద్‌పాల్ 51వ జన్మదిన వేడుకలను ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కేక్‌ను కట్ చేయించారు. ఈ సందర్భంగా వెంకట్రావ్ మాట్లాడుతూ.. ఆనంద్ పాల్ మరింత ఉత్సాహంతో సేవా కార్యక్రమాలను ముందుకు సాగించాలని ఆకాంక్షించారు.

నిధులున్నా.. నిర్లక్ష్యమే!

- నేటికీ ప్రారంభమవని వంతెన నిర్మాణ పనులు
- సమీపిస్తున్న వర్షాకాలం
- ఆందోళనలో ఆదివాసీలు



గత జూలై మాసంలో వరద ఉధృతికి కొట్టుకుపోతున్న తల్లీకూతుర్లు



పాములేరువాగుపై లోలెవల్ చప్టా

ములకలపల్లి: దేవుడు వరమిచ్చినా, పూజారి కరుణించలేదన్నట్లు ఉంది ఏజెన్సీ ప్రాంత ప్రజల పరిస్థితి. వాగు పొంగితే ప్రాణాలు అరచేతబెట్టుకుని రాకపోకలు సాగిస్తున్న దుస్థితుల్లో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ, నేటికీ పనులే మొదలుపెట్టకపోవడం అందుకు మచ్చుతునక. మండలపరిధిలోని చాపరాలపల్లి పంచాయతీ కుమ్మరిపాడు గ్రామానికి వెళ్లేందుకు గ్రామశివారులోని పాములేరు వాగును దాటాల్సి ఉంటుంది. వర్షాకాలంలో ఈవాగుపై నిర్మించిన చప్టాపై వరద పరవళ్లు తొక్కడంతో, దీనిని దాటేందుకు నానాకష్టాలు పడాల్సి ఉంటుంది. వరద0 ప్రవాహం తీవ్రంగా ఉన్న సమయంలో ఉధృతి తగ్గేవరకూ వేచి చూడాల్సిందే..

గతమెంతో విచారకరం..

గత ఏడాది జూలై 26వ తేదీన వాగుపై లోలెవల్ చప్టా దాటే క్రమంలో తల్లీకూతుర్లు కుంజా సీత, కుర్సం జ్యోతి ప్రవాహ ఉధృతిలో కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. చాపరాలపల్లికి నాటువేసేందుకు వచ్చి, తిరిగి ఇంటికి వెళుతున్న సమయంలో తల్లీకూతుర్లు వాగు ఉధృతికి గల్లంతయ్యారు, కూతురు జ్యోతి ఓ చెట్టుకొమ్మ పట్టుకొని, సురక్షితంగా బైటపడగా.. తల్లి కుంజా సీత మృతదేహం మూడు రోజుల అనంతరం సమీపంలోని వాగులో లభ్యమైంది.

శంకుస్థాపనకే పరిమితం..

చప్టా శిథిలావస్థకు చేరడం, ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో వాగుపై శాశ్వత వంతెన నిర్మాణానికి రూ 4.63 కోట్ల నిధులు మంజూరయ్యారు. దీంతో నాటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అక్టోబర్ 5వ తేదీన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అటుపిమ్మట అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పనులు ఆరంభించలేదు. శంకుస్థాపన చేసి సుమారు 8 నెలల కాలం పూర్తవున్నా, అసలు పనులే ముట్టుకోలేదు. నేటికీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నచందండా ఉంది పరిస్థితి. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అతీగతీ లేకపోవడంపట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధితశాఖ అధికారులు దృష్టిసారించాలని కోరుతున్నారు.

వరదకు అమ్మ చనిపోయింది..

వానొస్తే వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. గతేడాది కూలీ పనులకు వెళ్లి ఇళ్లకు వస్తూ, లోలెవల్ చాప్టా దాటుతున్నాం. వరద ఉధృతిని తట్టుకునేందుకు అందరం చేతులు కలిపి నడుస్తున్నాం. ఈ నేపథ్యంలో నేనూ, అమ్మా కొట్టుకుపోయాం. నేను ఎలాగోలా బైటపడ్డాను. కానీ అమ్మ చనిపోయింది.

– కుర్సం జ్యోతి, కుమ్మరిపాడు

పనులు మొదలుపెట్టాలి..

వంతెన నిర్మాణానికి నిధులు వచ్చాయని ఆనందపడ్డాం. కానీ నేటికీ పనులు ఎందుకు చేయట్లేదో అర్థం కావట్లేదు. గత వర్షాకాలంలో నిండు ప్రాణం బలి అయింది. ఈ వానాకాంలోగా పనులు పూర్తి చేసేలా సంబంధితశాఖ అధికారులు దృష్టి సారించాలి.

– చీకటి ప్రకాశ్, కుమ్మరిపాడు

విద్యుత్ స్తంభాల వల్లే ఆలస్యం..

లోలెవల్ చప్టా సమీపంలోని విద్యుత్ స్థంబాలు మార్చాల్సి ఉంది. ఇందుకు కావలసిన ఖర్చుకు సంబంధించి ఎస్టిమేట్లు సిద్ధమయ్యాయి. అప్రూవల్స్ రాగానే బిల్లులు చెల్లిస్తాం. పోల్స్ షిఫ్టింగ్ పెండింగ్ వల్లే పనులు నిలిచిపోయాయి. వీలైనంత త్వరగా పనులు మొదలుపెడతాం.

– రాంరెడ్డి, డీఈ, ఐటీడీఏ

నకిలీలు విక్రయిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ అఫ్జల్ బేగం

చంద్రుగొండ: నకిలీ విత్తనాలు విక్రయించే డీలర్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అశ్వారావుపేట డివిజన్ వ్యవసాయశాఖ ఏడీఏ అఫ్జల్ బేగం హెచ్చరించారు. డివిజన్‌స్థాయి విత్తన డీలర్ల సమావేశం చంద్రుగొండలోని రైతువేదికలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాఖా సిబ్బంది, విత్తన డీలర్లు నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాల బిల్లులు సక్రమంగా ఉంచాలన్నారు. రైతులు మోసపోకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పంట కాలం పూర్తయ్యే వరకు బిల్లులు దాచుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్సై మాచినేని రవి మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు విక్రయించే వారు పట్టుపడితే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో చంద్రుగొండ, ములకలపల్లి, అశ్వారావుపేట, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి ఏవోలు వినయ్, కరుణామయి, నవీన్, అనూష, ఆయా మండలాల ఏఈఓలు పాల్గొన్నారు.

కరకగూడెం: రైతులకు నకిలీ విత్తనాలు ఎవరైనా అందజేస్తే ఉక్కుపాదం తప్పదని కరకగూడెం ఎస్సై రాజేందర్ హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫర్టిలైజర్, పెస్టిసైడ్ షాపు యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలను విక్రయించినవారిపై పీడీ యాక్ట్ పెట్టి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలు ఫర్టిలైజర్ దుకాణదారులు తదితరులు పాల్గొన్నారు.

రాకేష్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి



దమ్మపేటలో ఓటర్లకు కరపత్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా, నాయకులు

అశ్వాపురం: ఈ నెల 27న జరగనున్న వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని గురువారం మండలంలో బీఆర్‌ఎస్ నాయకులు పలు గ్రామాల్లో పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, యూత్ మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, నాయకులు కంచుగట్ల వీరభద్రం, సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, నక్కనబొయిన పాపారావు, భూక్యా చందూలాల్, ఇసంపల్లి నరసింహారావు, జిలాని, నాయకులు పాల్గొన్నారు.

దమ్మపేట: బీఆర్‌ఎస్ పార్టీ మద్దతు తెలిపిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గురువారం మండల కేంద్రం దమ్మపేట గ్రామంలో పట్టభద్రుల ఓటర్లను కలసిన మాజీ ఎమ్మెల్యే, ప్రశ్నించే గొంతుక అయిన రాకేష్ రెడ్డికి ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, దారా యుగంధర్, ఉయ్యాల చిన్నవెంకటేశ్వరరావు, అబ్దుల్ జిన్నా, యేసు, పాకనాటి శ్రీను, ఉయ్యాల లక్ష్మీనారాయణ, భూక్యా రాజు, తాళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

‘భూ’పండుగ సందడి!



వినాయకపురం వద్ద చందాలు వసూలు చేస్తున్న దురదపాడు గిరిజనులు

అశ్వారావుపేటరూరల్: వానాకాలం సీజన్ దగ్గర పడటంతో గిరిజన గ్రామాల్లో భూ పండుగ సందడి నెలకొంది. గిరిజనులు వ్యవసాయ పనులు ప్రారంభించే ముందు చందాలు సేకరించడం వారి ఆనవాయితీ వస్తోంది. గురువారం మండలంలోని వినాయకపురం గ్రామం వద్ద శ్రీచిలకల గండీ ఆలయం దగ్గర, అశ్వారావుపేట– భద్రాచలం ప్రధాన రహదారిలో దురదపాడు గ్రామానికి చెందిన గిరిజన మహిళలు, యువతి యువకులు, పెద్దలు కలిసి వాహనదారులను ఆపి వారి దగ్గర నుంచి భూ పండుగ కోసం చందాలను వసూలు చేశారు. చందాల ద్వారా సేకరించిన డబ్బులతో ఆయా గ్రామాల్లో భూ పండుగను ఘనంగా జరుపుకుంటారు. ఈ నేపథ్యంలోనే గిరిజన మహిళలు ప్రధాన రహదారిపై రేలేరేల నృత్యాల, పాటలతో సందడి చేశారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

దుమ్ముగూడెం: మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలోని ఎరువుల దుకాణాలను అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్ సుధాకర్ రావు గురువారం తనిఖీలు చేశారు. దుకాణాలలోని విత్తనాలకు సంబంధించిన రికార్డులను క్షుణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్తీ విత్తనాలను విక్రయిస్తే కఠినచర్యలు తీసుకోబడతాయని సూచించారు. ఏఓ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

దుమ్ముగూడెం: మండలంలోని కొత్త దంతెనం గ్రామానికి చెందిన రెడ్డీబోయిన శేఖర్ కుమారుడు చాణిక్య పాలు మీద పడి తీవ్రగాయాలు అయ్యి భద్రాచంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో వైద్యఖర్చులకు ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం చిన్నా అరుణాచలం భక్తులు సహకారంతో బాబు వైద్యం నిమిత్తం ఆలయ వ్యవస్థాపకుడు శివ నాగస్వామి రూ.10 వేలు అందజేశారు. చిన్నారి వైద్యం కోసం ఆర్థికసాయం అందించిన ప్రతి ఒక్కరికీ శివనాగస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

అన్నపురెడ్డిపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మండలంలోని ఎర్రగుంట ప్రధాన సెంటర్‌లో వీఎం బంజర నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న కారు, ఎర్రగుంట గ్రామంలో నుంచి ప్రధాన సెంటర్‌కు వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ద్విచక్ర వాహనం పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో గాయాలపాలైన వ్యక్తులను కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు కూలీలకు..

గుండాల: తునికాకు సేకరణకు కోసం వెళ్లిన ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. తునికాకు సేకరణకు చీమలగూడెవకు చెందిన 20 మంది ట్రాక్టర్‌పై గురువారం శంభునిగూడెం అడవుల్లోకి వెళ్లారు. ఆకు సేకరణ అనంతరం తిరిగి వస్తుండగా.. ట్రాక్టర్ ట్రాలీ పల్టీ కొట్టింది. పాయం లక్ష్మి, కల్తి యశోదకు తీవ్ర గాయాలు కాగా.. మిగతా వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఘటనాస్థలికి 108 వెళ్లే పరిస్థితి లేకపోవడంతో కాంట్రాక్టర్లు, గ్రామస్తులు ప్రైవేట్ వాహనాల్లో వెళ్లి క్షతగాత్రులను గుండాల ఆస్పత్రికి తరలించారు.

మొక్కలు నాటిన కార్మికులు

మణుగూరురూరల్: ప్రకృతిని మించిన ప్రత్యక్ష దైవం లేదని, నాటి జీవులను, మనుషులను ప్రేమించాలని ప్రేమతత్వాన్ని బోధించిన బుద్ధుని జన్మదిన సందర్భంగా మణుగూరు ఏరియా సింగరేణి రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు గురువారం పీవీకాలనీ రైల్వేగేట్ ప్రాంతంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఇఫ్టూ నాయకులు మంగీలాల్ మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులు కె.నరేష్, కె.గురుమూర్తి, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులు, అకాల వర్షం



మణుగూరుటౌన్: పట్టణంలోని రాజుపేట వద్ద ఈదురుగాలులకు కమ్ముకున్న దుమ్ము..

మణుగూరుటౌన్: మండలంలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులతో కూడిన జోరు వర్షం కురిసింది. దీంతో వాహనాలపై వెళ్లేవారు ఈదురుగాలులు వల్ల లేచిన దుబ్బతో ఎదురుగా వచ్చే వాహనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉక్కపోతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మండల ప్రజలకు సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఊపిరిపీల్చుకున్నారు. ఆరుబయట సేదతీరారు.

ములకలపల్లి: ములకలపల్లిలో గురువారం భారీ వర్షం కురిసింది. రోజంతా భానుడి ప్రతాపానికి అల్లాడిన ప్రజలకు సాయంత్రం వేళ కురిసిన వానతో కాస్త ఉపసమనం లభించింది. ఈదురుగాలులతో మొదలై ఉరుములు, మెరుపులతో కూడిన వానకు ప్రజానీకం అల్లాడారు. సుమారు గంటకు పైగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మండలకేంద్రంలో చీకట్లు కమ్ముకున్నాయి. విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారు. భారీ వర్షానికి వాతావరణం కాస్త చల్లబడింది.

పీహెచ్‌సీల్లో తనిఖీ



చంద్రుగొండ: రికార్డులు పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అదనపు అధికారి భాస్కర్‌నాయక్

అన్నపురెడ్డిపల్లి: అకాల వర్షాలు కురుస్తుండడంతో ఏజెన్సీ ప్రాంతాలలో జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉన్న దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ భాస్కర్‌నాయక్ ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని ఎర్రగుంట పీహెచ్‌సీని గురువారం ఆయన సందర్శించారు. పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న అమ్మక్లినిక్, గర్భిణీ క్లినిక్‌లను పరిశీలించి, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు ప్రసవం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి రావాలని కోరారు. ప్రతి నెలా పీహెచ్‌సీలో డెలివరీ కేసుల సంఖ్య పెంచాలని, చిన్న పిల్లలకు ఇచ్చే టీకాల టార్గెట్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక, సీహెచ్‌ఓ పూలమ్మ, పీహెచ్ఎన్ఓ ఎస్తేర్‌రాణి, హెచ్‌ఈఓ కృష్ణయ్య, హెచ్‌వీ శారారాణి తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామీణుల్లో అనారోగ్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని జిల్లా వైద్య ఆరోగ్య అదనపు అధికారి డాక్టర్ భాస్కర్‌నాయక్ సూచించారు. చంద్రుగొండలోని పీహెచ్‌సీని గురువారం ఆయన సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతీ శుక్రవారం ఫ్రైడే యాక్టివిటీని తూచా తప్పకుండా చేపట్టాలన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గ్రామీణులకు ఆరోగ్య పరీక్షలు చేయాలని తెలిపారు. గ్రామాల్లో ప్రజలను ఆరోగ్యంపై అప్రమత్తం చేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా సూచనలు ఇవ్వాలన్నారు. ముందు జాగ్రత్త చర్యలపై వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తనూజ, వైద్య సిబ్బంది శోభారాణి, ఎండి.ఇమామ్, ఎం.లక్ష్మి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా కొర్రాజుల జాతర

దుమ్ముగూడెం: మండలంలోని సీతానగరం గ్రామంలో పూర్వికుల కాలం నుంచి నిర్వహిస్తున్న కొర్రాజుల జాతరను గ్రామస్తులు వైభవంగా నిర్వహిస్తున్నారు. జాతరలో భాగంగా గురువారం వనరాజులను తీసుకువచ్చే ఘట్టాన్ని పెద్దరాజు పోతురాజు చినరాజు ఊరేగింపు కార్యక్రమాన్ని అశేష భక్తజనం మధ్యన వైభవంగా చేపట్టారు. జాతరను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుండి భారీగా ప్రజలు తరలివచ్చారు. వనయాత్ర ముగింపు సందర్భంగా ఈరోజు రాత్రి అగ్నిగుండం కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో చేపడుతున్నారని, అగ్నిగుండం కార్యక్రమం తిలకించడానికి అత్యధిక సంఖ్యలో భక్తుల హాజరు కావాలని కొర్రాజుల మహోత్సవ కమిటీ కోరారు.

వేడుకగా నృసింహుని తిరు కల్యాణం

భద్రాచలం: భద్రాచలం సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఉపాలయంలో గురువారం తిరుకల్యాణోత్సవం వేడుకగా జరిగింది. తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా లక్ష్మీ సమేత స్వామి వారిని మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ పందిరిలో వేంచేపు చేసి కల్యాణ క్రతువును కమనీయంగా జరిపారు. దేవస్థానం తరుపున ఆలయ అధికారులు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం రథోత్సవంను జరపనున్నారు. రామాలయ ప్రధాన అర్చకులు విజయ రాఘవన్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని గుంపెన గ్రామంలో అక్రమంగా రవాణా చేస్తున్న 90 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఉదయం గుంపెన నుంచి ఏపీలోని కాకినాడ వద్ద గల కడియం గ్రామానికి రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని ఏఎస్ఐ సర్దార్, కానిస్టేబుల్ రాంబాబు పట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బియ్యం విలువ సుమారు రూ.1.17 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. రవాణా చేస్తున్న ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

అశ్వాపురంలో 10 క్వింటాళ్లు ..

అశ్వాపురం: మండల కేంద్రంలో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం పోలీసులు పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్ ఎదుట వాహనాలు తనిఖీ చేస్తుండగా మణుగూరుకు చెందిన నరసింహారావు టాటా మ్యాజిక్ వాహనంలో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని భద్రాచలం మీదుగా చింతూరు తరలించేందుకు వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బియ్యం స్వాధీనం చేసుకొని వాహనం సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

ఆలయాల్లో పూజలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం, అశ్వారావుపేటలోగల షిరిడి సాయిబాబా ఆలయాల్లో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని బాబాను దర్శించుకున్నారు. వివిధ రకాల పూజలు చేసి, క్షీరాభిషేకాలు చేశారు. అలాగే పలు రకాల నైవేద్యాలను సమర్పించి, పల్లకి సేవలు చేశారు. ఆలయాల వద్ద మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన



దమ్మపేట: నాగుపల్లిలో లక్ష్మీనరసింహ స్వామి కల్యాణంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట: మండల పరిధిలోని జగ్గారం, అంకంపాలెం, కొడిసెలగూడెం, పట్వారిగూడెం, నాగుపల్లి తదితర గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేసిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గురువారం మండలంలోని జగ్గారం, అంకంపాలెం, పట్వారిగూడెం గ్రామాల్లో పర్యటించిన ఆయన.. ఆయా గ్రామాల్లో నేరుగా పట్టభద్రుల ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో, ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్న తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కొడిశెలగూడెం గ్రామంలో ఇటీవలే మృతి చెందిన వారి కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించారు. అదే గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. నాగుపల్లి గ్రామంలో ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ మహోత్సవానికి హాజరై, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కల్యాణాన్ని వీక్షించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం గ్రామంలో ఇటీవల మృతి చెందిన వర్సా రాములమ్మ దశదిన కర్మలకు గురువారం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హాజరై రాములమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. గొందిగూడెం గ్రామానికి మొట్టమొదటి సారిగా విచ్చేసిన ఎమ్మెల్యే ఆదినారాయణకు మాజీ సర్పంచ్‌లు, స్థానిక నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పాయం భద్రమ్మ, పొడియం అనిల్, వంకా సత్యనారాయణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ములకలపల్లి: అకాల మృత్యువాతపడ్డ ములకలపల్లి మాజీ సర్పంచ్ బీబినేని వీరభద్రం కుటుంబాన్ని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గురువారం పరామర్శించారు. వీరభద్రం మృతదేహానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. భద్రం కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం సీతారాంపురంలో అనారోగ్యంతో మృతిచెందిన ఊకే ముత్తమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, మాజీ ఉపసర్పంచ్ శనగపాటి అంజి, మాజీ సర్పంచ్ కారం సుధీర్, మిరియాల అనినాష్, నకిరకంటి కొండల్‌రావు, పొన్నూరి హరి, గుమ్మడి దేవస్వామి తదితరులు ఉన్నారు.